పొలం దారి కబ్జాపై ఫిర్యాదు

పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ


ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు 30 ఏళ్లుగా ఉన్నటువంటి దారిని కొందరు వ్యక్తులు కబ్జాచేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వృద్ధ దంపతులు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సబ్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. స్వయంగా వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. గుర్రంకొండ మండలం అరిగిలవారిపల్లె రెవెన్యూ గ్రామం 138/2 సర్వేనెంబర్‌లోని 3.66 ఎకరాల భూమిలో మూడుబోర్లు వేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు రైతు పూల వెంకటరమణ తెలిపారు. ఈ భూమిలోకి వెళ్లేందుకు 35 ఏళ్లుగా వాడుకలో ఉన్న ఒకే ఒక దారిని తమ గ్రామానికి చెందిన మునివెంకటరెడ్డి, బి.అనిల్‌కుమార్‌లు ఆక్రమించేందుకు ప్రయత్నించారన్నారు. దీనిపై తాను హైకోర్టులో రెవెన్యూడిపార్ట్‌మెంట్‌పై కేసు వేయడంతో రోడ్డుకు ఆటంకం లేకుండా చూడాల్సిందిగా గుర్రంకొండ తహసీల్దార్‌కు ఉత్తర్వులిచ్చారన్నారు. అయితే తహసీల్దార్ కోర్టు ఉత్తర్వులు అమలుచేయకపోవడంతో వాల్మీకిపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసు దాఖలు చేయగా, ఇంజక్షన్ ఆర్డర్ మంజూరుచేశారన్నారు. దానిని తహసీల్దార్ అమలుచేయకపోగా, కాలయాపన చేస్తున్నారన్నారు. వ్యవసాయాధారిత కుటుంబం కావడంతో వేరే ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పొలానికి వెళ్లే దారిని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాల్సిందిగా కోరారు. నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామం జాండ్రబైలుకు చెందిన రైతులు, వ్యవసాయ పొలాలకు దారి సౌకర్యంపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. గ్రామంలోని సర్వేనెంబర్.366-1 నుంచి సర్వేనెం.762లోని వ్యవసాయ భూములకు వెళ్లాల్సి ఉందన్నారు. అయితే ఆ భూమిలోని రైతులు రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ, పొలాలకు వెళ్లేందుకు దారిలేకుండా ఆటంకం కలిగిస్తున్నారన్నారు. రెండు సర్వేనెంబర్లలోని భూములు డీకేటీవి కావడంతో రెవెన్యూ అధికారులు ఆయా సర్వేనెంబర్లలోని భూములు కలిగిన రైతులకు దారి సమస్య లేకుండా చూడాలని వినతి చేశారు. మదనపల్లె పట్టణం నక్కలదిన్నె సిద్దమ్మలేఅవుట్‌లో 2013లో దొమ్మలపాటి వెంకటేశ్వరప్రసాద్ నుంచి కుంట స్థలం రూ.5లక్షలకు కొనుగోలు చేసి ఫెన్సింగ్ వేసుకున్నామని, అయితే ఆ స్థలాన్ని వెంకటేశ్వరప్రసాద్ మరణాంతరం అతడి బంధువులు తిరిగి వేరొకరికి విక్రయించడంతో వారు ఆ స్థలాన్ని కబ్జా చేసి అందులో భవనాన్ని నిర్మిస్తున్నారన్నారు. కష్టార్జితంతో కొనుగోలు చేసిన తమ భూమిని ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆక్రమించి భవంతిని నిర్మిస్తున్నాడని వేపూరికోట అవధూత ఆదినారాయణస్వామి ఫిర్యాదుచేశారు. పట్టణంలోని అమ్మినేనివీధిలో కాపురం ఉంటున్న నడిమిగోళ్ల అలివేలమ్మ... పదేళ్లుగా తాము వాడుతున్న హెచ్‌పీ గ్యాస్ కనెక్షన్‌ను, ఇండేన్ గ్యాస్ కంపెనీలో దీపం పథకం కింద కనెక్షన్ మంజూరైందనే సాకుతో ఆరునెలలుగా నిలిపివేసినట్లు తెలిపింది. అయితే ఎస్ఆర్ ఇండేన్ గ్యాస్ కంపెనీ వారిని కలిసి, తాను దరఖాస్తు చేసుకోకుండానే కనెక్షన్ ఎలా మంజూరైందని, తమ పేరుతో ఉన్నటువంటి గ్యాస్ కనెక్షన్, ఆధార్ సీడింగ్ తొలగించాల్సిందిగా కోరితే పట్టించుకోవడం లేదని ఫిర్యాదుచేసింది.


దారి సమస్యపై మొరపెట్టుకుంటున్న వృద్ధ రైతులు

ఇస్కఫ్ జిల్లా సమితి ఎన్నిక


డీవీ.రమణ, జంషీర్‌బాషా, జీవి.శివకుమార్

మదనపల్లె : భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) జిల్లా ప్రతినిధుల సమావేశం సోమవారం రాష్ట్ర కార్యదర్శి తుంగా శ్రీధర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఇస్కఫ్ జిల్లా సమితి నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జంషీర్‌బాషా, అధ్యక్షుడిగా డివి.రమణ, ప్రధాన కార్యదర్శిగా జి.వి.శివకుమార్, కార్యవర్గసభ్యులు నాగేశ్వరరావు, లచ్చారెడ్డి, హేమనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తుంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ... అన్ని మతాలు, వర్గాల మధ్య స్నేహసంబంధాలు ఉండాలని, విద్యార్థులు, యువకులు, మేధావులు ఇస్కఫ్‌ను బలమైన సంఘంగా రూపొందించాలని కోరారు. నూతనంగా ఎన్నికైన నాయకత్వం ఏప్రిల్ 26, 27 తేదీల్లో మదనపల్లె జరిగే ఇస్కఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు.

31 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేవీపల్లె : మండలంలోని మిన్నంరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 31 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వంగిమళ్ల శ్రీనివాసులురెడ్డి, వంగిమళ్ల నరసారెడ్డి తెలిపారు. సోమవారం రెండో రోజూ చెన్నై శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పొర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల్లో 200 మందికి కంటి పొర పరీక్షలు చేయడం జరిగిందని, 31 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరు కంటి పొర పరీక్షలు, అనంతరం ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొత్తపు సతీష్‌రెడ్డి, శంకర్‌నేత్రాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం


సామూహిక అక్షరాభ్యాస పూజలు

పీలేరు రూరల్ : వసంత పంచమిని పురస్కరించుకుని స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సోమవారం అర్చకులచే సరస్వతీ పూజ, హోమం నిర్వహించారు. అనంతరం చిన్మయ మిషన్ స్వామి కృష్ణానందచే పిల్లలకు అక్షరాభ్యాసం చేపించారు. పట్టణంలోని పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలచే అక్షరాభ్యాసం కోంచ తీసుకువచ్చారు. కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, మల్లికార్జునగుప్తా, శివఫణీష్, బీఆర్ఎం. పటేల్, శశిధర్‌రెడ్డి,హెచ్ఎం మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా వైద్యులకు సత్కారం


సత్కారం అందుకున్న మహిళా వైద్యులు

బి.కొత్తకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్యులు నిరుపమాన సేవలు అందిస్తున్నారని బీజేపీ నేతలు కొనియాడారు. మహిళా వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వైద్యులు హసీనా బేగం, దుర్గాదేవిలను సత్కరించి వారి సేవలను ప్రస్తుతించారు. గైనికాలజిస్టుగా హసీనా బేగం పట్టణ, గ్రామీణ ప్రాంత మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు గతంలో ఎన్నడూ జరగలేదని అన్నారు. ప్రతిరోజూ ఆస్పత్రికి వస్తున్న మహిళా రోగుల సంఖ్యను చూస్తే ఆమె అందిస్తున్న సేవలు చెబుతాయని అన్నారు. దంత వైద్యురాలిగా దుర్గాదేవి పేదలకు సేవ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆరీఫుల్లా, బీజేపీ నాయకులు గోరంట్ల రమేష్, శీలం రంగారెడ్డి, మేడా ముకుంద, కృష్ణమూర్తి, నరేష్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మికి జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కల్యాణలక్ష్మి

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ పొట్టావాండ్లగడ్డ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఏ.బీ.కళ్యాణలక్ష్మికు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మికి పురస్కారంతో పాటు జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు. విద్యారంగానికి ఆమె చేసిన సేవలు గుర్తించి అవార్డును అందజేశారు. ఆమెకు ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి,రాజగోపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చక్కటి జీవనశైలితో ఒత్తిడి దూరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : చక్కటి జీవనశైలితో ఒత్తిడికి దూరంగా ఉండవచ్చునని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఒత్తిడికి లోనైతే అది చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు సమయపాలన, ఉన్నత విలువలు పెంచుకోవడం, ఓర్పు, నేర్పు, విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పరామర్శ


ఉపాధ్యాయుడు జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

పీలేరు : అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడు, ఎస్టీయూ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పరామర్శించారు. సోమవారం జగన్‌మోహన్‌రెడ్డి స్వగృహానికి చేరుకుని ఆరోగ్య స్థితిని అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని పరామర్శించారు. అలాగే జేకే కాలనీలో ఆర్ఎస్. సురేంద్రరెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దండు జగన్‌మోహన్‌రెడ్డి, హబీబ్‌బాషా, ఆనంద్, చక్రధర్, రమేష్‌రెడ్డి, పెద్దోడు, భాస్కర్‌రెడ్డి, కుసుమశేఖర్‌రెడ్డి, కుచ్చు అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుపై ముగిసిన శిక్షణ


శిక్షణ పూర్తి చేసుకున్న రైతులతో కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: స్థానిక కేవీకేలో వారం రోజుల పాటు కొబ్బరి సాగు, సస్యరక్షణ, సైకిల్ వాడకంపై జరిగిన శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలికిరి, వాల్మీకిపురం, కేవీపల్లి, సదుం తదితరాల మండలాల నుంచి సుమారు 20 మంది శిక్షణ పూర్తి చేసుకున్న రైతులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. కొబ్బరి చెట్లు సైకిల్ సాయంతో ఎక్కడంపై సాధన, సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వారం రోజుల పాటు రైతులకు తెలియచేయడం జరిగిందని, కొబ్బరి రైతులకు ఇది ఎంతగానే ఉపకరిస్తుందని కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలిపారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్వరాజ్యలక్ష్మీ, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు


ఫుట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న వశిష్ట స్కూలు, శ్రీవేద స్కూలు క్రీడాకారులు

మదనపల్లె సిటీ: ఖేల్ ఇండియా అస్మిత అండర్-17 ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లీగ్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి పరిచయం చేసుకున్నారు. వశిష్ట స్కూల్, శ్రీవేదస్కూల్‌ల మధ్య జరిగిన పోటీల్లో 1-0 స్కోరుతో వశిష్ట స్కూల్ విజయం సాధించింది. వశిష్ట పాఠశాల,మదనపల్లె ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాల జట్టుపై 1-0 తో వశిష్ట గెలుపొందింది. శ్రీవేద పాఠశాల, కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టుపై 1-0 స్కోరుతో శ్రీవేద విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్‌కుమార్, కార్యదర్శి మురళీధర్, అసోసియేషన సభ్యులు మహేంద్రనాయక్,బాలాజీ, లత, కోచ్ మహేంద్ర, అంజనప్ప, పీడీలు అన్సర్, తాజ్‌బాషా, నరేష్,భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన రాజగోపుర ప్రతిష్ట


అంకుర్పారణ కార్యక్రమంలో వేదపండితులు


తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న రాజగోపుర కలశాల ప్రతిష్ట మహోత్సవం సోమవారంతో ముగిసింది. టీటీడీ ఆగమ సలహాదారు శ్రీనివాసచార్యులు సూచనల మేరకు అర్చకులు కృష్ణప్రసాద్‌భట్టార్, రమేష్‌బాబు, కృష్ణమూర్తిలు సంప్రదాయబద్ధంగా ఉదయం చతుష్టార్చన, మహాపూర్ణహుతి, కుంభ ఉద్వాసన,సత్వార నివేదన,మంగళహారతి,ఆచార్యబహుమానం కార్యక్రమాలను నిర్వహించారు. గోపురంపై కలశాలను ప్రతిష్టించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకుర్పారణ చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ సెక్రటరీల బదిలీ


ఎంపీడీఓ తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదుచేస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్

మదనపల్లె : పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ రూల్స్, ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన పంచాయతీ సెక్రటరీల బదిలీలను నిరసిస్తున్నామని, వెంటనే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన(బీవైఎస్) అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ఎంపీడీఓ తాజ్ మస్రూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ..గ్రేడ్ 4, 5 పంచాయతీ సెక్రటరీలను స్థానిక మండలాల్లో, పంచాయతీల్లో సెక్రటరీలుగా నియమించకూడదని పంచాయతీరాజ్ అడ్మినిస్ట్రేటివ్ రూల్స్‌లో స్పష్టంగా పేర్కొనడం జరిగిందన్నారు. అయితే మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీకి స్థానికురాలైన మంజులను సెక్రటరీగా బదిలీ చేశారని, ఈ విషయమై మూడునెలలుగా కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓకు ఫిర్యాదుచేసినా అధికారపార్టీ ఒత్తిడులతో పట్టించుకోవడం లేదన్నారు. సొంత పంచాయతీకి స్థానికురాలైన మంజులను సెక్రటరీగా నియమించడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెక్రటరీ కుటుంబ సభ్యులకు పంచాయతీలో పలు భూతగాదాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను, ఫిర్యాదులను ఆమె తారుమారు చేసే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నట్లు చెప్పారు. అలాగే పంచాయతీ పారిశుద్య కార్మికులను సెక్రటరీ తమ ఇంటి సొంత పనులకు, క్లీనింగ్ పనులకు వాడుకుంటోందని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపించి, స్థానిక పంచాయతీ నుంచి సెక్రటరీ మంజులను వేరే మండలంలోని పంచాయతీలకు బదిలీ చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరీష్, చిరంజీవి, ఆది, శ్రీధర్, ఇమ్రాన్, షహెన్‌షా, హరి, శివకుమార్, వినయ్, వేణు, శశి, నితీష్, శీను, భానుప్రకాష్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి కృషి


అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ విజయకుమారి

పీలేరు : రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి కృషి అవసరమని ఎంవీఐ విజయకుమారి అన్నారు. సోమవారం 36వ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపే వారు విధిగా ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఎస్ఐ బాలకృష్ణ, షీ సంస్థ నిర్వాహకురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు నాగరికతకు ప్రతీకలు

సంబేపల్లె : ఆలయాలు నాగరికతకు ప్రతీకలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని గున్నికుంట్ల గ్రామం దిగువ రాచపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో జరిగిన నూతన విగ్రహ ప్రతిష్ట, కల్యాణోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రతేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సమష్టి కృషితో ఇంత పెద్ద ఆలయాన్ని నిర్మించుకోవడం హర్షణీయమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి

మదనపల్లె సిటీ: మదనపల్లెలో పలు ఆలయాల్లో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజన్నకు టెంకాయలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక అమ్మచెరువువద్దనున్న సరస్వతి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో వసంతపంచమి వేడుకలు నిర్వహించారు.

కంప్యూటర్ మానిటర్‌ను కొరికివేసిన ఎలుకలు

- రూ.10వేల ఆస్తినష్టం

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఎలుకలు స్వైర విహారం చేస్తున్నాయి. జిల్లా ఆస్పత్రికి వారంరోజుల క్రితం కొత్త కంప్యూటర్ మానిటర్‌లు వచ్చాయి. వీటిని సిబ్బంది ఫిమేల్ వార్డు వద్ద భద్రపరిచారు. అయితే జిల్లా ఆస్పత్రిలోఎలుకల బెడద అధికంగా ఉండటంతో, నూతనంగా వచ్చిన కంప్యూటర్ మానిటర్‌ను అవి కొరికివేశాయి. సోమవారం ఉదయం కంప్యూటర్లను అమర్చేందుకు సిబ్బంది వాటిని తీయగా, ఎలుకలు మానిటర్‌ను కొరికివేసిన సంగతి బయటపడింది. మానిటర్ విలువ రూ.10వేలు ఉంటుందని సిబ్బంది చెప్పారు. అయితే, జిల్లా ఆస్పత్రిలో ఎలుకలు, పాములు, బొద్దింకలు లేకుండా పర్యవేక్షించాల్సిన పెస్ట్ కంట్రోల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో వీటి బెడద అధికమైందన్నారు. ఆస్పత్రి రోగుల వార్డుల్లోనూ ఎలుకలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

జావాకు ప్రపంచలో అంత్యంత ఆదరణ


మాట్లాడుతున్న సుబ్రమణ్యం

కురబలకోట: జావా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిందని ఎల్ అండ్‌టి టెక్ టెక్నికల్ లీడ్ ఎ. సుబ్రమణ్యం అన్నారు. అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎ డీప్ డైవ్ ఇన్‌టు జావా డెవలప్‌మెంట్ అంశంపై బిటెక్ విద్యార్థులకు సోమవారం జరిగిన వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జావా డెవలప్‌మెంట్‌లో మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి చోటా ఉపయోగపడుతున్న జావా కేరీర్‌కు రాజమార్గంలా ఉపయోగపడుతుందన్నారు. దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఐటీ పరిశ్రమలో కేరీర్ విజయానికి జావాపై పట్టు సాధించాలన్నారు. దీనికి విశ్వ వ్యాప్తంగా ఆదరణ లభిస్తోందన్నారు.

7న సయ్యద్‌నాదర్‌షాహ్ వల్లి దుర్గా ఉరుసు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం రైల్వేగేట్ వద్దనున్న హజరత్ సయ్యద్ నాదర్‌షాహ్‌వల్లి దర్గా ఉరుసు ఈనెల 7వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు మకాన్‌దార్ జాఫర్‌వలీ తెలిపారు. 7వతేదీన గౌసేపాక్ జెండా ఆవిష్కరణ, 8వతేదీన గంధం, అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 9వతేదీన బార ఇమామ్ ఫాతెహా, 10వతేదీన తహలీల్ ఫాతెహా జరుగుతుందన్నారు. హిందూ,ముస్లిం సోదరులు ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

క్లుప్తంగా

'ఫీజుపోరు' వాయిదా

కలికిరి (వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ ఈ నెల 5న తలపెట్టిన ఫీజు పోరు కార్యక్రమం వాయిదా పడినట్లు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిష్టానం పిలుపు మేరకు అనివార్య కారణాలతో కార్యక్రమం వాయిదా వేయడం జరిగిందని, తదుపరి ఫీజు పోరు తారీఖును ప్రకటించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు గమనించాలని ఆయన కోరారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : రాష్ట్రంలోని బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో....స్వయం ఉపాధి పథకం కింద జనరిక్ మెడికల్ షాపుల నిర్వహణకు ఆసక్తి ఉన్న బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ కులాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 7వ తేదీలోపు తమ పేర్లను ఏపీ-ఓబీఎంఎస్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదుచే సుకోవాలన్నారు. వివరాలకు పట్టణ మెప్మా కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాయితీ రుణాలకు..

కలకడ : రాయితీ రుణాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీమ్ కోరారు. సోమవారం ఆయన మట్లాడుతూత మండలంలోని బీసీలకు బీసీ కార్పోరేషన్ నుంచి రాయితీ రుణాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 7వతేదీ లోపు 21-60 సంవత్సరాల లోపు వారు కుల ధ్రువీకరణ పత్రాలు, అర్హత పత్రాలు అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని దరఖాస్తు ఫారాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నిర్మల


డీఎంగా బాధ్యతలు స్వీకరించిన నిర్మల

పీలేరు రూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పి. నిర్మల బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ డీఎంగా ఉన్న కుమార్ ఉద్యోగ విరమణ చెందారు. తిరుపతి జిల్లా మంగళం డిపో మేనేజర్‌గా పని చేస్తున్న పి. నిర్మల పీలేరుకు బదిలీ అయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తంబళ్లపల్లె మండలం బోయపల్లెకు చెందిన కృష్ణప్ప(62) భార్య రామలక్ష్మ(55)తో కలిసి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు వెళుతుండగా, మార్గమధ్యంలోని చింతామణి సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన చికిత్సల కోసం రెఫర్ చేశారు.


ఆలయాలు ముక్తికి మార్గం

కురబలకోట: మండలంలోని గొల్లపల్లె క్రాస్ వద్ద కొత్తగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. పరిసర గ్రామాలు, దాతల సహకారంతో దీనిని నిర్మించారు. వైభవంగా ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఇతరులకు సాయం చేయడం గొప్ప విషయమని ఆలయాలు ముక్తికి మార్గాలని వక్తలు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రమణ్యషష్టి

మదనపల్లె సిటీ: స్థానిక యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సుబ్రమణ్యషష్టి పూజలు ఘనంగా నిర్వహించారు.స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అగస్త్యేశ్వరునికి పూజలు



రాయచోటి జగదాంబసెంటర్ : పాత రాయచోటిలో వెలసిన శ్రీ దాక్షాయణీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం కావడంతో స్వామి వారి మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం పలు పూజాది క్రతువులను ఆలయ అర్చకులు నిర్వహించారు. సమీప ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనగా వారికి ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.